క్లుప్తంగా

ఎన్‌ఎస్‌యూఐ కమిటీ ఏర్పాటు

అడ్డాకుల: మూసాపేట మండలం తిమ్మాపూర్‌లో సోమవారం ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు బోయరవి ఆధ్వర్యంలో గ్రామ కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా రెడ్డి వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా మల్లేష్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బోయరవిని స్థానిక నాయకులు శాలువాతో సత్కరించారు. సురేష్, దేవన్న, హరిశంకర్‌గౌడ్, శ్రీకాంత్, రమేష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ..

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ చర్చిలో మహబూబ్‌నగర్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. చీఫ్ ప్యాట్రన్‌గా రెవరెండ్ ఎస్.వరప్రసాద్, చైర్మన్‌గా రెవ.ఎస్.యేసుపాదం, వైస్ చైర్మన్‌గా రెవ.కేపీ.ఎప్రాం, ప్రధాన కార్యదర్శిగా రెవ.ఎంఆర్.సుందర్‌పాల్, సహాయ కార్యదర్శిగా విద్యాసాగర్, కోశాధికారి రెవ.బీఎస్.పరంజ్యోతి, సహాయ కోశాధికారిగా జె.ప్రకాశ్ ఎన్నికయ్యారు. అదేవిధంగా సలహాదారులుగా అల్లం మర్రెడ్డి, పీఏ.దేవదాస్, జయపాల్, నోముల యోహాన్, దానియల్ సుధీర్, రాజారత్నం, ఈసీ మెంబర్లుగా శ్యాం కమలాకర్, అనిల్‌కుమార్, తిమోతిరాజ్, బాల్‌రాజు, నాగరాజులను ఎన్నుకున్నారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేడు సమావేశం

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై మంగళవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. కార్యనిర్వహణాధికారి దీప్తి సోమవారం వివరాలు తెలియజేశారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ఉత్సవాల నిర్వహణ, సమన్వయం చేసుకోవటం వంటి అంశాలపై సమీక్ష ఉంటుందని, ఆర్డీఓ హాజరవుతారని తెలిపారు.

పూజలు ప్రారంభం

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయం పరిసరాలు శుభ్రం చేసి దీపధూపనైవేద్యాలు ప్రారంభించారు. పోలేపల్లి యువకులతో పాటు రాజాపూర్ మండలం రాయపల్లి యువకులు ప్రశాంత్‌చారి, సూరిబాబుగౌడ్, రమేష్‌జీ, కేశవ్‌చారితోపాటు కొందరు శివభక్తులు ఆలయం శుద్ధిచేయడానికి కృషిచేశారు. ఈ ప్రాంగణంలోని చెన్నకేశవస్వామి ఆలయం సైతం ఈనెల 11న శుభ్రం చేసి పూజలు ప్రారంభించనున్నట్లు యువకులు తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత

జడ్చర్ల టౌన్: దేశవ్యాప్తంగా ఈనెల 16న సమ్మె, గ్రామీణబంద్ కార్యక్రమం నేపథ్యంలో వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో సోమవారం ఈజీఎస్ ఏపీఓ విజయభాస్కర్‌కు నోటీసు అందజేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మెకు సహకరించాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రంతో పాటు, నోటీసును ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్, యాదయ్య, సుందరమ్మ, మంజుల పాల్గొన్నారు.

ఏకగ్రీవ ఎన్నిక

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లా గిరిజన సేవా సంఘాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శేఖర్‌నాయక్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా లక్ష్మణ్‌నాయక్, ప్రధానకార్యదర్శిగా ప్రతాప్‌నాయక్, రమేశ్‌నాయక్, కోశాధికారిగా కిషన్‌పవార్, ఉపాధ్యక్షులుగా ధాక్యానాయక్, గోవింద్ నాయక్, గోపాల్, వెంకటేశ్, రమేశ్‌నాయక్, రంగ్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేశ్ నాయక్, అసోసియేట్ అధ్యక్షుడిగా కిషన్‌నాయక్ తదితరులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైనవారిని ఘనంగా సన్మానించారు.

చర్యలు తీసుకోవాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): లైన్ మెన్ శ్రీనివాస్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఉద్యోగుల యూనియన్1104 జిల్లా అధ్యక్షుడు స్వామి కోరారు. సీఐ గాంధీనాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. విధి నిర్వహణలో లైన్‌మెన్‌పై ఉద్దేశపూర్వకంగా దాడిచేశారని తెలిపారు. అనంతరం సీఐని సన్మానించి యూనియన్‌డైరీని అందజేశారు. కార్యదర్శి పాండు, విజయ్‌ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

బాలానగర్‌కు చేరిన పాదయాత్ర బృందం



బాలానగర్: గడప గడపకు గోవిందుడు, గీత లక్ష్యంతో లక్ష్యసాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో 70 మంది స్వాములతో చేస్తున్న పాదయాత్ర సోమవారం బాలానగర్ చేరుకుంది. జనవరి 21న హైదరాబాద్‌లో ప్రారంభమైన గట్టు అరుంధతీ, రంగచార్యులు, యోగీష్ ప్రభు తదితరులతో కూడిన శ్రీవారి పాదయాత్ర బృందానికి వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ తదితరుల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అయ్యప్ప, హనుమాన్ ఆలయాల్లో గీతాపారాయణం చేశారు. సునీల్, ప్రభాకర్, హన్మంత్ రెడ్డి, అవినాష్, శ్రీశైలం పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేయాలి

- జడ్చర్ల మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ భర్తపై
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్లు



జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

జడ్చర్ల: మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్, చైర్‌పర్సన్ లక్ష్మి భర్త దోరెపల్లి రవీందర్ అవినీతి అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ కౌన్సిలర్లు చైతు చౌహాన్, శ్రావణి, పుష్పలత, చైతన్య, నర్సిములు, శ్రీశైలమ్మ, శశికిరణ్, తదితరులు సోమవారం కలెక్టర్‌కు రవినాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఇళ్ల తదితరాల అనుమతుల విషయంలో అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. అదేవిధంగా ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఫుట్‌పాత్ వ్యాపారాలకు సంబంధించి ఇలా అనేకం ఉన్నాయన్నారు. పట్టణ ప్రణాళిక వ్యవస్థ పూర్తిగా లోప భూయిష్టంగా మారిందన్నారు. ఇంటి నంబర్ల జారీకి సైతం మామూళ్లు తీసుకుంటున్నార ఆరోపించారు. కాగా ఆరోపణల్లో నిజం లేదని కమిషనర్ షేక్ తెలిపారు. వారు చెప్పిన విధంగా అంగీకారం తెలపక పోవడంతో తప్పుడు ఫిర్యాదు చేశారని అన్నారు. అయితే సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్లు చైర్‌పర్సన్ భర్తపై ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రవేశ పెట్టేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.

చెరువును కాపాడండి

రాజాపూర్: ముదిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన పాలమూరు ప్రగతి డీటీసీపీ వెంచర్ పల్లె చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నందుకు అనుమతి రద్దు చేయాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన వెంకటయ్య గత కలెక్టర్ విచారణ చేయించగా వెంచర్ ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో ఉన్నదని రుజువైందన్నారు. యాజమాన్యంపై చర్యలు తీసుకుని చెరువును కాపాడాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబసభ్యులతో ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: కొండాపూర్ బీఆర్‌ఎస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి సోదరుడు శేఖర్‌రెడ్డి(56) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు యాదయ్య, గోపాల్‌గౌడ్, కృష్ణగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు తిరుపతయ్య, జైపాల్ తదితరులు ఉన్నారు.

బాలానగర్: వీరన్నపల్లి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నరేందర్ హఠాన్మరణం చెందగా.. బాధిత కుటుంబాన్ని ఎంపీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సోమవారం పరామర్శించారు. వైస్ ఎంపీపీ వెంకటచారి తదితరులు ఉన్నారు.

పాలమూరులో ప్రత్యేక తనిఖీ





తాత్కాలికంగా డివైడర్ ఏర్పాటు చేస్తున్న పోలీసులు,మున్సిపాలిటీ ఎదుట నిలిపిన వాహనం తరలింపు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్, రూరల్, టూటౌన్, వన్‌టౌన్ పోలీసులు సోమవారం ప్రత్యేక తనిఖీ నిర్వహించారు. ట్రిబుల్ రైడింగ్, నెంబర్ ప్లేట్ సక్రమంగా లేని వాహనాలతో పాటు, నో–పార్కింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ వాటిపై చర్యలు తీసుకున్నారు. సరైన నెంబర్ ప్లేట్ లేని వాహనాలు అన్నింటినీ ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఎదురుగా నో–పార్కింగ్ ఏరియాలో నిలిపిన వాహనాలు స్టేషన్‌కు తరలించారు. దీంతో పాటు అశోక్ టాకీస్ చౌరస్తా దగ్గర ఉన్న బ్రిడ్జి నుంచి క్లాక్‌టవర్ వెళ్లే రోడ్డు మధ్యలో తాత్కలిక డివైడర్ ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన డివైడర్ వల్ల ట్రాఫిక్ సమస్య కొంత తగ్గనుంది. వాహనాల రాకపోకలు సులువుగా జరగనున్నాయి.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు



నాగన్న



ఎం.శ్రీనివాసులు



వెంకటేష్

సాక్షినెట్‌వర్క్: జిల్లాలోని పలుచోట్ల ఎస్‌ఐలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దేవరకద్ర ఎస్‌ఐగా బి.నాగన్న సోమవారం విధుల్లో చేరారు. అడ్డాకుల ఎస్‌ఐగా ఎం.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. మూసాపేట ఎస్‌ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కె.సుజాతను సోమవారం నేతాజీ యువజన సంఘం సభ్యులు సన్మానించారు. హన్వాడ ఎస్‌ఐగా కనుగుల వెంకటేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.



మూసాపేట ఎస్‌ఐ సుజాతకు సన్మానం

సీఐకి సన్మానం

ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన గాంధీనాయక్‌ను సన్మానించారు. దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య పాల్గొన్నారు.

పాలనపై దృష్టి వహించాలి



బాలానగర్: గ్రామాల్లో పాలనపై ప్రత్యేక దృష్టి వహించాలని ఎంపీపీ కమల, మండల ప్రత్యేక అధికారి బాబురావ్ అన్నారు. మంగళవారం సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అధికారులు ఎజెండాలను చదివి వినిపించారు. ప్రత్యేక అధికారి పాలనపై సూచనలు చేశారు. సమస్యలను రికార్డులలో నమోదు చేసి గ్రామ సభలు నిర్వహించిన అనంతరమే పనులు చేపట్టాలని అన్నారు. ఎంపీడీఓ కృష్ణారావు, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తయారుచేస్తే చర్యలు

బాలానగర్: కృత్రిమంగా ఇసుక తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఆర్‌ఐ రాజేశ్వరి, పోలీసులతో కలిసి గంగదారిపల్లి కుంటలోపు తండా సమీపంలో సోదాలు నిర్వహించారు. ఎలాంటి అనుమతి లేకుండా కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న ఓ ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. యజమాని సుధాకర్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపాజీ తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

బాలానగర్: రోడ్డు భద్రతపై సోమవారం మండల కేంద్రంలోని ముఖ్య కూడలిలో కళాజాత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎస్పీ ఆదేశాలతో కార్యక్రమాలు చేపట్టినట్లు కళాకారులు తెలిపారు. వివిధ అంశాలపై వాహనదారులకు వివరించారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



ఆడిట్‌లో పాల్గొన్న అధికారులు

గండీడ్: ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ జకీయా సుల్తానా పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో (2022–23) సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. రూ. 11.45 కోట్లతో చేపట్టిన పనులను పరిశీలించారు. అవకతవకలను సభలో వివరించారు. బయటపడ్డ అక్రమాలపై సరైన కారణం లేకపోతే రికవరీ చేస్తామన్నారు. బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. మాజీ సర్పంచులు జితేందర్‌రెడ్డి తదితరులు ఎప్పుడో చేసిన పనులకు ఇప్పుడు ఆడిట్ నిర్వహించడం ఎంతవరకు సమంజసమన్నారు. పనులు చేపట్టాల్సిన సమయంలోనే స్పష్టమైన ఆదేశాలతో కూడిన నిబంధనలు పొందుపర్చాలన్నారు. కాగా మంగళవారం ఆడిట్ కొనసాగనుంది. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, విజిలెన్సు అధికారి ప్రేమలత, అంబుడ్స్‌మన్ సంతోష్, ఎంపీడీఓ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

రికవరీకి ఆదేశాలు

హన్వాడ: మండల వ్యాప్తంగా మొత్తం 35 పంచాయతీల్లో రూ.6.95కోట్ల పనులు జరిగినట్లు ప్రజావేదికలో తనిఖీ బృందం వివరించారు. అట్టి పనుల్లో జరిగిన అక్రమాల విలువ రూ. 15,500 ఉన్నట్లు చూపారు. కాగా పీడీ యాదయ్య రూ.20,400 వసూలు చేయాలని ప్రజావేదికలో ఆదేశాలు జారీ చేశారు. తప్పులు దొర్లితే సహించేది లేదన్నారు. ఏపీడీ శ్రీపాద, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, ఏపీఓ హేమలత, ఈజీఎస్ శాఖ అధికారులు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

క్యారమ్ బోర్డుల అందజేత



మిడ్జిల్: మండల పరిధిలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన దాత డోలు శ్రీను క్యారమ్ బోర్డులు అందజేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి మాట్లాడారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు గ్రామస్తులు ముందుకు రావడం ఎంతో సంతోషకరమన్నారు. హెచ్‌ఎం హేమలత, కాంప్లెక్స్ హెచ్‌ఎం సుధాకర్, వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ శివప్రసాద్, పాండు తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ డైరీ ఓ కరదీపిక

మహబూబ్‌నగర్ రూరల్: మహనీయుల జీవిత ఘట్టాలు, రాజ్యాంగం కల్పించిన చట్టాలు, ఎస్సీ, ఎస్టీ చట్టాలు, పున్నయ్య కమిషన్ సిఫార్సులు, అనేక జీఓలు ప్రచురించి సామాజిక ఉద్యమకారుల చేతుల్లో కేవీపీఎస్ డైరీ ఒక కరదీపిక లాగా ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కేవీపీఎస్ ముద్రించిన 2024 డైరీని ఆయన ఆవిష్కరించారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దళితులు అన్ని రంగాల్లోనూ రాణించేందుకు అండగా ఉంటుందని అన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్యంరాజు, ఆది విష్ణువర్ధన్, నాయకులు వేణు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం తర్వగా పూర్తిచేయాలి

మహమ్మదాబాద్: అన్నారెడ్డిపల్లి బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని పీఆర్ డిప్యూటీ ఈఈ సురేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పనులు ఇప్పటికే 60 శాతం పూర్తయినట్లు పేర్కొన్నారు. మరో రెండు నెలల్లో పూర్తిగా చేయవచ్చని సూచించారు. వరదనీటి ప్రవాహంతో ఈవాగుతో ప్రజలకు ఎంతో ఇబ్బందిగా ఉన్నందున ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. అలాంటి వంతెన త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. అదేవిధంగా నాణ్యతలో రాజీ పడకుండా పకడ్బందీగా నిర్మించాలని సూచించారు. పీఆర్ ఏఈ మతిన్, అన్నారెడ్డిపల్లి ఎంపీటీసీ తదితరులు ఉన్నారు.

అబాకస్ పోటీలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రవీంద్ర భారతీ పాఠశాలలో విద్యార్థులకు అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జోనల్ స్థాయి పోటీలను విశ్వం ఎడ్యుటెక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి 300 మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల కరస్పాండెంట్ నందీశ్వర్ విద్యార్థులకు ఇటువంటి పోటీ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సంస్థ ఏరియా మేనేజర్ నర్సింహులు, జోనల్ మేనేజర్ రాకేష్, నవీన్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్లపై చర్యలు తీసుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి మూతపడిన పాఠశాలను తెరిపిస్తానని.. అందుకోసం మార్గదర్శకాలు రూపొందించాలని అధికారులను ఆదేశించిడం హర్షనీయమని తెలంగాణ ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారూఖ్ హుస్సేన్ అన్నారు. ఈ మేరకు సోమవారం సీఎం కార్యాలయానికి లేఖ పంపించారు. అదేవిధంగా అక్రమ డిప్యూటేషన్లపై చర్యలకు ఉపక్రమించాలని అన్నారు. అందుకోసం ఆదేశాలు జారీచేయాలని కోరారు.

వేతనం పెంచాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ నాన్‌టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలని కోరుతూ సిబ్బంది మంత్రి జూపల్లి కృష్ణారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాగులోకి వెళ్లే దారుల మూసివేత



కొమిరెడ్డిపల్లి వద్ద వాగులో దారులను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ



అక్రమంగా ఇసుక రవాణా

సాక్షి ఎఫెక్ట్..

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి వద్ద పెద్దవాగు నుంచి రాత్రివేళ అక్రమంగా ఇసుక రవాణా సాగుతోంది. గ్రామానికి చెందిన మినీ డీసీఎంలలో సాగుతున్న అక్రమ దందాపై ఆదివారం సాక్షి దినపత్రికలో 'అక్రమంగా ఇసుక రవాణా' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో విషయంపై సోమవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎస్‌ఐ కె.సుజాత కొమిరెడ్డిపల్లి వాగు వద్దకు వెళ్లారు. వాగులోకి వాహనాలు వెళ్లే దారులను పరిశీలించారు. మినీ డీసీఎంలు, ట్రాక్టర్లు ఇసుక కోసం వాగులోకి వెళ్లకుండా జేసీబీ సాయంతో దారుల వద్ద కాల్వలను తవ్వించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తహసీల్దార్, ఎస్‌ఐ హెచ్చరించారు. మళ్లీ దారులను ఏర్పాటు చేసినా చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో గిర్దావర్ రవి తదితరులు ఉన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్లలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఎదిర జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు మాస్టర్ సత్యనారాయణ తెలిపారు. మధుప్రియ, జనప్రియ, పల్లవి బంగారు, వర్ష, వైష్ణవి, శ్రీభరత్ రజత, వైష్ణవి, అంకిత్ కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. వారిని సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం హేమచంద్రుడు, మాస్టర్ సత్యనారాయణ అభినందించి సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిబాబు, మహేంద్రచారి, శ్రీనివాస్, ఉమారాణి, జాకీర్ హుస్సేన్, పీఈటీ మేరి పుష్ప, కిరణ్‌తోపాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం



శాఖాపూర్‌లో శరత్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

అడ్డాకుల: గ్రామాల్లో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు అన్ని కమిటీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీ కార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని శాఖాపూర్‌లో సోమవారం యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో యూత్ బూత్ కమిటీలను ఎంపిక చేశారు. 93వ బూత్‌నకు రాజేందర్, 94వ బూత్‌నకు పర్వత్‌రాజ్‌లను ఎంపిక చేసినట్లు శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శరత్‌కుమార్ రెడ్డిని స్థానిక నాయకులు శాలువాతో సత్కరించి అభినందించారు. రాంరెడ్డి, కృష్ణయ్య యాదవ్, బాలరాజు, దాదెన్న, రామకృష్ణ, కృష్ణయ్య, కురుమూర్తి, శివకుమార్, చెన్నకేశవులు ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

హన్వాడ: పంచాయతీ కార్మికులు ఉద్యోగ భద్రత కల్పించాలని, పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ ధనుంజయగౌడ్‌కు సోమవారం సమర్పించారు. తెలంగాణ ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, బాలకిష్టి, రాములు, వెంకటయ్య, చెన్నయ్య, బాలమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. యూనియన్ మండల కమిటీ అధ్యక్షుడు వెంకట్రాములు, రాజేందర్, వెంకటయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పైపులు చోరీ: కేసునమోదు

మిడ్జిల్: వాడ్యాల్‌కి చెందిన చౌదరిపల్లి కృష్ణయ్య గ్రామానికి చెందిన బెల్లె మల్లయ్య వ్యవసాయ పొలంలో సోమవారం తెల్లవారుజామున ఐదు స్ప్రింక్లర్ పైపులను చోరీచేశాడు. దీంతో గమనించిన స్థానిక రైతులు అతడిని పట్టుకున్నారు. పోలీసులకు అప్పగించారు. కాగా బాధిత రైతు ఫిర్యాదు మేరకు కృష్ణయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

గ్రంథాలయ పరిశీలన



బాలానగర్: మండల కేంద్రంలోని లైబ్రరీని జిల్లా గ్రంథాలయ అధికారి మనోజ్ కుమార్ సందర్శించారు. గ్రంథాలయంలో నిత్యం వస్తున్న పాఠకుల వివరాల రిజిస్టర్ బుక్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పాఠకుల సంఖ్య పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని.. ఈమేరకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రంథాలయ అధికారి జానకిరాం, లలితమ్మ తదితరులు ఉన్నారు.

బాల్క సుమన్‌పై ఫిర్యాదు

నవాబుపేట: బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండల కాంగ్రెస్ నాయకులు పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, నవాజ్‌రెడ్డి, నర్సింహ, సత్యం, అజహర్, తదితరులు ఉన్నారు. కాగా హెడ్ కానిస్టేబుల్ సుధీర్‌బాబు ఫిర్యాదు అందుకుని.. విషయాన్ని ఎస్పీకి తెలిపి తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.

బీసీలకు టికెట్ కేటాయించాలి

కోయిల్‌కొండ: పార్లమెంటు ఎన్నికల్లో మహబూబ్‌నగర్ టికెట్‌ను అన్ని పార్టీలు బీసీ అభ్యర్థులకే కేటాయించాలని నేషనల్ ధోబీసంఘ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సమావేశంలో మాట్లాడారు. టికెట్లు కేటాయించకపోతే పార్టీల మనుగడ ప్రశ్నార్థకం కావడం ఖాయమన్నారు. జిల్లా సంఘం అధ్యక్షుడు నాగన్న, చెన్నయ్య, మల్లేష్, యాదగిరి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులకు సన్మానం



చిన్నచింతకుంట: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక అధికారులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఏదులాపూరంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, అప్పంపల్లిలో ఎంపీఓ అనిల్‌కుమార్, కురుమూర్తిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రఘు బాధ్యతలు స్వీకరించారు. వారిని ఆయా గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులు ఘనంగా సన్మానించారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించాలని తెలంగాణ నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట యాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాంకు వినతిపత్రం సమర్పించారు. సదానందం, ఉమేష్ కుమార్, మల్లేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన

మక్తల్: మండంలోని కర్నిలో సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బేటి బచావో.. బేటి బడాఓ పై అవగాహన నిర్వహించారు. సీడీపీఓ రేణుక బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎక్కడైన బాలికలను వేధించడం, బాల్యవివాహాలు చేస్తే ఫోన్ 1098కు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరి, సీడీపీఓ రేణుక, అనిత తదితరులు పాల్గొన్నారు.

చెక్ డ్యాం నిర్మాణానికి భూమిపూజ

మద్దూరు: మండలంలోని దోరేపల్లి వాగుపై నిర్మాణం చేపట్టనున్న చెక్ డ్యాం పనులకు సోమవారం జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, కాంగ్రెస్ నాయకులు సంజీవ్, మల్లేష్, రామకృష్ణ తదితరులు భూమిపూజ చేశారు. 2.5 కోట్ల వ్యయంతో నీరు పారుదల శాఖ చేపట్టే ఈ చెక్‌డ్యాంతో దాదాపు 300ఎకరాల రైతులకు కొత్తగా ఆయాకట్టు వస్తుందని అధికారులు తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు నాయకులు సూచించారు.